# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 14 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 4





పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు

హోలీ శుభాకాంక్షలు

- బలగం టీవి సీఈఓ బాలు కాయితీ


# అసెంబ్లీలో రచ్చ

**స్పీకర్‌పై జగదీశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ ఆరోపణ  సస్పెండ్ చేయాలని డిమాండ్**

**జగదీశ్‌రెడ్డిపై బడ్జెట్ సమావేశాల పూర్తయ్యేవరకు సస్పెన్షన్ వేటు**

**నిరసనగా సభను వాకౌట్ చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల రెండో రోజు సభ హీటెక్కింది. అధికార ప్రతిపక్షం మాటల యుద్ధం తారాస్థాయికి వెళ్లింది. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ సభ్యులు, మంత్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

సభ ప్రారంభం కాగానే గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీర్మానం ప్రవేశపెట్టి మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పులు, అవినీతి, అక్రమాల్లో నెంబర్ వన్‌గా ఉంటే.. ఇప్పుడు కాంగ్రెస్ పాలనతో వ్యవసాయంలో నెంబర్ వన్‌గా ఉన్నామన్నారు. రైతుల సంక్షేమంలో, ఉద్యోగ నియామకాలు, పరిశ్రమల పెట్టుబడుల్లో నెంబర్‌వగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ముందుకెళ్తుందంటూ ప్రభుత్వ పథకాలపై వివరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గవర్నర్ మనస్ఫూర్తిగా ప్రసంగాన్ని చదివి ఉండరన్నారన్నారు. 15 నెలల పాలనను కేవలం 15 నిమిషాల్లో చదివేశారన్నారు. రైతులకు రుణమాఫీ చేశారా? మహాలక్ష్మి పథకాన్ని అమలు చేశారా? రైతు కూలీలకు రూ.12వేలు ఇచ్చారా? అధికారం కోసం లక్షల అబద్ధాలు చెప్పారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడుతుండగానే కాంగ్రెస్ నాయకుల మాట్లాడారు. దాంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కల్పించుకొని మాట్లాడారు. సభ్యుడు మాట్లాడకుండా మంత్రులు అడ్డు తగులుతున్నారన్నారు. నువ్వెంత.. నేనెంత అంటే సభ నడుస్తుందా? అని ప్రశ్నించారు. ఆ స్పీకర్ గడ్డం ప్రసాదం కల్పించుకొని ప్రతిపక్షాలు గవర్నర్ ప్రసంగంపైనే మాట్లాడాలని సూచించారు.అధికార పక్షం డీవియేషన్ కాకుండా ఉండేందుకు గవర్నర్ ప్రసంగంపైనే మాట్లాడాలన్నారు.

ఈ తర్వాత జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను గవర్నర్ ప్రసంగంపైనే మాట్లాడానని.. అధికారంపై పక్షం నుంచి మంత్రి ఏం మాట్లాడారో.. రాష్ట్రమంతా చూస్తుందని.. ఆయన మాట్లాడిన మాటాలకు.. గవర్నర్ ప్రసంగానికి సంబంధం ఉందా? అని ప్రశ్నించారు. దానిపై తేల్చాలని.. సభలో ఉండమంటే ఉంటా? లేకపోతో పోతానన్నారు. సభలో జరుగుతుందని రాష్ట్ర ప్రజలంతా చూస్తున్నారన్నారు. అనంతరం స్పీకర్ జగదీశ్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ.. అసహనానికి గురవొద్దని.. సహనంతో ఉండాలన్నారు.సభాసంప్రదాయాలను కాపాడాలన్నారు. పదేళ్లు మంత్రిగా ఉన్నారన్నారు. సభా సంప్రదాయాలను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. దీనికి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఏం విరుద్ధంగా మాట్లాడాలో చెప్పాలన్నారు. ఈ సభ అందరిదీ. సభ్యులందరికీ సమాన అవకాశాలు ఉన్నాయి. మా అందరి తరపున పెద్ద మనిషిగా, స్పీకర్‌గా మీరు కూర్చున్నారు. ఈ సభ మీ సొంతం కాదు' అంటూ జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనికి అధికారపై పక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారు. జగదీశ్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత హరీశ్‌రావు మాట్లాడుతూ శ్రీధర్‌బాబు వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డి ఏం తప్పు మాట్లాడారని ప్రశ్నించారు. సభలో అందరు సభ్యులకు సమాన హక్కులు ఉంటాయన్నారు. శాసనసభ అంటే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వానికి సంబంధించినది కాదు.. ప్రతిపక్ష శాసనసభ్యులకు సమాన హక్కు



ఉంటుంది జగదీశ్‌రెడ్డి అన్నారన్నారు. అయితే కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా తప్పుపడుతూ దళితుడు స్పీకర్ స్థానంలో కూర్చుంటే ఓర్వలేకే జగదీశ్‌రెడ్డి ఇలాంటి ఏకవచన సంభోదంతో జుగుప్సాకర వ్యాఖ్యలు చేస్తున్నారనీ, ఆయన్ని సభ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దీనితో బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఉదయం 11.35 నిముషాలకు సభను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభ తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైంది.

స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభలోకి రాగానే కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. సభాధ్యక్ష స్థానాన్ని ఏకవాక్యంతో సంభోదిస్తూ, స్పీకర్ స్థానాన్ని అగౌరవపరిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు. దళితుడైన స్పీకర్‌కు జరిగిన అవమానంగా దాన్ని పరిగణిస్తున్నామని చెప్పారు. అనంతరం మరో కాంగ్రెస్ సభ్యులు రామచంద్రనాయక్ మాట్లాడుతూ దళిత స్పీకర్‌ను జగదీశ్‌రెడ్డి అహంకారపూరిత భాషతో, అభ్యంతరకర బాడీలాంగ్వేజ్‌తో దూషించడం సరికాదన్నారు. గతంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్నారనీ, డిప్యూటీ సీఎంగా ఉన్న దళిత రాజయ్యను

మిగితా 2వ పేజీలో



# తెలంగాణ రైజింగ్ విజన్‌కు మద్దతివ్వండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జయశంకర్‌తో సీఎం భేటీ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

రాబోయే 25 ఏండ్ల పాటు తెలంగాణ రైజింగ్ విజన్‌ను సమున్నతంగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతునివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం జయశంకర్‌ని కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ ఏడాది హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యక్రమాలైన మిస్ వరల్డ్ పోటీలు, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్ ఈవెంట్లు, యానిమేషన్ గేమింగ్, వీఎఫ్ఎక్స్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే ఇండియా జాయ్ వంటి వేదికల వివరాలను ముఖ్యమంత్రి గారు కేంద్ర మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లారు. దౌత్య సహకారంతో జరిగే ఈ గ్లోబల్ ఈవెంట్స్ విజయవంతం అయ్యేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విదేశాల్లో నిర్వహించే భారత కార్యక్రమాల్లోనూ తెలంగాణ రైజింగ్‌కు తగినంత ప్రచారం, ప్రాధాన్యం కల్పించాలని విన్నవించారు.

ముఖ్యమంత్రి అభ్యర్థన పట్ల విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ సానుకూలంగా స్పందించారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ప్రధానంగా ఉందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోన్న హైదరాబాద్ నగరంలో చేపట్టే కార్యక్రమాలకు విదేశీ వ్యవహారాల శాఖ మద్దతు ఇస్తుందని కేంద్ర మంత్రి గారు తెలియజేశారు. కేంద్ర మంత్రి జైశంకర్‌తో జరిగిన భేటీలో ముఖ్యమంత్రి గారి వెంట కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ గారు, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ గారు, డాక్టర్ మల్లు రవి గారు, చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు ఉన్నారు.

# నేను ఎవరి ట్రాప్‌లో పడను

- గవర్నర్ ప్రసంగానికి కాదు...
- సభలో చర్చకు రావాలని కేసీఆర్‌కు పిలుపు
- మెట్రో, మూసీ, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్‌లకు అనుమతి మాత్రమే కోరుతున్నాం
- వీటికి రుణాలిచ్చేందుకు బ్యాంకులు సిద్ధం
- ఈ విషయమై ఎప్పుడైనా మంత్రి కిషన్‌రెడ్డి ప్రధానిని కోరారా..?
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

తాను ఎవరి ట్రాప్‌లో పడనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగానికి కేసీఆర్ రావడం కాదు, అసెంబ్లీలో చర్చలకు రావాలని సీఎం సవాల్ విసిరారు. గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధముందని, ఫొటోలు దిగి చూపించుకోవాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాను ఎవరో తెలియకుండానే పీసీసీ అధ్యక్షుడిగా, సీఎంగా ఎంపిక చేశారా అంటూ ప్రశ్నించారు. ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి చిట్‌చాట్ నిర్వహించారు.రాష్ట్రానికి సంబంధించిన అంశాలు సాధించుకురావాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. రాష్ట్రానికి రావాల్సినవి కిషన్‌రెడ్డి పట్టించుకోవట్లేదన్నారు. ప్రధాని, కేంద్రమంత్రులు ప్రకటించిన హామీలు అడుగుతున్నామని అన్నారు. రీజినల్ రింగ్‌రోడ్డు, మెట్రో విస్తరణ, కేంద్ర ప్రాజెక్టులే ఇవ్వాలని అడుగుతున్నామని తెలిపారు. మెట్రోకి కేంద్ర కేబినెట్ అనుమతి ఇస్తే పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. మెట్రో విస్తరణ హైదరాబాద్ గేమ్ ఛేంజర్ అని హర్షించారు. 10 ఏళ్లలో కేసీఆర్ ఒక్క కొత్త పాలసీ కూడా తీసుకురాలేదని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. నిరుద్యోగాన్ని 8.8 శాతం నుంచి 6.1 శాతానికి తగ్గించామన్నారు. రూ.2.2 లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు తెచ్చామని వివరించారు. పన్ను వసూళ్లలో తెలంగాణ ముందంజలో ఉందన్నారు.

తెలంగాణలో భారత్ సమ్మిట్ పేరిట ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారు 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ సమ్మిట్‌కు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తదితరులు హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. భారత్ సమ్మిట్‌కు కేంద్ర ప్రభుత్వం క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుందని ఆ విషయంపైనే విదేశాంగ మంత్రి జైశంకను కలుస్తున్నట్లు సీఎం తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో మిస్ ఇండియా పోటీలు జరగనున్నాయని నెలరోజుల పాటు దీనికి సంబంధించిన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. దీనికోసం రెండు రోజుల్లో అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

# మా గొంతునొక్కారు



- నేడు నిరసనలకు పిలుపు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాగ్ధానాల భంగంపై విమర్శల దాడి చేస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం తట్టుకోలేక బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని శాసనసభ నుంచి సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు మండిపడ్డారు. జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం ఎదుట బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'పేరుకేమో ప్రజాపాలన, ప్రజా ప్రభుత్వం అంటున్నారు. మేం ప్రజాస్వామికంగా ఉన్నామని చెప్పి.. తెల్లారిస్తే పాడిందే పాటలా.. అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డులా.. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల దాకా అందరూ ఒకేమాట ప్రజాపాలన, ఇందిరమ్మ పాలన అని చెబుతరు. కానీ, నిన్న గవర్నర్ ఉభయసభల నుంచి ఉద్దేశించి చేసిన ప్రసంగంపై, అందులోని డొల్లతనంపై, చెప్పిన పసలేని విషయాలు, పచ్చిఅబద్ధాలపై మా పార్టీ తరపున శాసనసభలో మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు జగదీశ్‌రెడ్డి మాట్లాడం మొదలుపెట్టి పది నిమిషాలు కాకముందే ఆరు నిమిషాల్లోపే ఉద్దేశపూర్వకంగా అటు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రన్నింగ్ కామెంట్రీ చేస్తూ, ఆయన ప్రసంగానికి అంతరాయం కలిగిస్తూ ఇష్టం వచ్చిన కామెంట్స్ చేశారు' అన్నారు.

'జగదీశ్‌రెడ్డి ఏమాత్రం సంయమనం కోల్పోకుండా.. రాష్ట్రంలో ఎండిపోతున్న పంటలు, రాష్ట్రంలో అధోగతి పాలైన వ్యవసాయం, రైతుల కష్టాలు, జరగని రుణమాఫీ, పడని రైతుబంధుపై ఎండగట్టారు. తన పద్ధతుల్లో చాలా స్పష్టంగా ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజల తరపున ఓ హెచ్చరిక చేశారు. అమలుకాని ఆరు

మిగితా 2వ పేజీలో



# ఐదుగురు ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

- స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణ
- కాంగ్రెస్ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్
- బీఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదు స్థానాలకు ఐదు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. కాంగ్రెస్ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్, బీఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం ఎన్నికయ్యారు. వీరు కాకుండా ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు నిబంధనల మేరకు లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి వాటిని తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం సాయంత్రం 5గంటలకు ముగిసింది. దీంతో ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ఉపెందర్‌రెడ్డి ప్రకటించారు

# ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగి ఇరవై రోజులు దాటింది. ఫిబ్రవరి 22వ తేదీన జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది చిక్కుకుపోగా, నాలుగు రోజుల క్రితం ఒకరి మృతదేహాన్ని వెలికితీశారు. మిగిలిన ఏడుగురిని గుర్తించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సింగరేణి రెస్క్యూ బృందాలు, ర్యాట్ మైనర్స్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే, అన్వి రోబోటిక్స్, కేరళ క్యాడవర్ డాగ్స్ సహాయక బృందాలు నిత్యం శ్రమిస్తున్నాయి. ఏడుగురు ఉన్నట్లుగా భావిస్తున్న డీ-1, డీ-2 వద్ద తవ్వకాలు చేపట్టారు.

# డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం



- డీలిమిటేషన్ ఎత్తుగడకు వ్యతిరేకంగా అవసరమైతే జాతీయ స్థాయిలో ఆందోళన
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సరైన విధానాలు లేకుండా లోక్‌సభ నియోజకవర్గాల డీలిమిటేషన్ చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పునరుద్ఘటించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా

మిగితా 2వ పేజీలో



## డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి హాజరవుతాం

- బీఆర్ఎస్, తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- 22న చెన్నైలో నిర్వహించబోతున్న సమావేశానికి బీఆర్ఎస్‌ను ఆహ్వానించిన డీఎంకే నేతలు

వివరాలు 2వ పేజీలో

# చంద్రయాన్-4కు మార్గం సుగమం

- స్పేడెక్స్ శాటిలైట్ల డీ-డాకింగ్ సక్సెస్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పేడెక్స్ మిషన్ డీ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తవుతుంది. ఈ మేరకు భారత అంతరిక్ష సంస్థ ఇస్రో గురువారం స్పేడెక్స్ ఉపగ్రహాల డీ -డాకింగ్ పూర్తయినట్లు ప్రకటించింది. స్పేడెక్స్ శాటిలైట్ల డీ-డాకింగ్(విడదీత) గురువారం విజయవంతంగా జరిగిందని కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ ఘన విజయం చంద్రుడి అన్వేషణ మానవ అంతరిక్షయానం , భారత సొంత స్పేస్ స్టేషన్ ను నిర్మించడానికి వంటి ఇస్రో భవిషత్తు మిషన్లకు మార్గం సుగమం చేస్తుంది.

ఇస్రో సాధించిన ఈ చారిత్రాత్మక విజయంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ హర్షం వ్యక్తం చేశారు. తన అధికారిక సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్ ఎక్స్ లో పోస్ట్ ద్వారా ఇస్రో బృందాన్ని అభినందించారు. SpaDeX శాటిలైట్‌లు నమ్మశక్యంకాని డీ-డాకింగ్‌ను సాధించాయి. ఇది భారత సొంత స్పేస్ స్టేషన్, చంద్రయాన్ 4, గగన్‌యాన్‌తో సహ ఇస్రో ప్రతిష్టాత్మక భవిష్యత్ మిషన్‌లను సజావుగా నిర్వహించడానికి మార్గం సుగమం చేస్తుంది"అంటూ కేంద్రమంత్రి తెలిపారు.

ఇస్రో 30 డిసెంబర్ 2024న రాత్రి 10:00:15 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) ప్రయోగాన్ని చేపట్టింది. ఈ మిషన్‌లో శాస్త్రవేత్తలు PSLV-C60 ద్వారా SDX01 (ఛేజర్), SDX02 (టార్గెట్) అనే రెండు శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపించారు.

PSLV-60 ఈ శాటిలైట్లను విజయవంతంగా నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ స్పేడెక్స్ మిషన్ ద్వారా SDX01(ఛేజర్), SDX02 (టార్గెట్) రెండు ఉపగ్రహాలు రోదసిలో డాకింగ్, అన్‌డాకింగ్ నిర్వహించేందుకు శాస్త్రవేత్తలు ప్లాన్ చేశారు. ఇస్రో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఉపగ్రహాల డాకింగ్ ప్రక్రియ 2025 జనవరి 7 న జరగాల్సి ఉంది. అయితే ఈ మిషన్ లో సాంకేతిక కారణాలు తలెత్తడంతో డాకింగ్ ప్రక్రియపై మరికొంత పరిశోధన అవసరమని అనుకొని ఆ షెడ్యూల్ ను జనవరి 9 కి మార్చినట్లు మొదట ఇస్రో ప్రకటించింది.ఈ ప్రాసెస్ జనవరి 9, 2025 ఉదయం 8:00 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఉపగ్రహాల మధ్య దూరం ఊహించిన దాని కంటే ఎక్కువగా ఉండటంతో ఈ ప్రయోగాన్ని మరోసారి వాయిదా వేసినట్లు ఇస్రో ప్రకటించింది. ఈ ప్రయోగంతో ప్రపంచంలో ఇంత అధునాతన టెక్నాలజీని కలిగి ఉన్న నాలుగో దేశంగా భారత్ అవతరించింది. ఇప్పటి వరకు రష్యా, అమెరికా, చైనా దేశాలు మాత్రమే ఈ టెక్నాలజీని కలిగి ఉన్నాయి.

# స్పీకర్ ప్రజా స్వామ్యబద్ధంగా పనిచేయాలి



బలగం టీవీ, హైదరాబాద్

అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రజా స్వామ్యబద్ధంగా పనిచేయాలని, లేకపోతే ఆయనపై అవిశ్వాస తీర్మానం పెడతామని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను అవమానించలేదన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ సభ ప్రతి ఒక్కరిదని 'మీ' అనే పదం సభ నిబంధనలకు విరుద్ధం కాదని చెప్పారు. 'మీ ఒక్కరిది' అనే పదం కూడా అన్ పార్లమెంటరీ కాదన్నారు. కాంగ్రెస్ సభ్యులు ఎందుకు నిరసన వ్యక్తం చేశారో సభను స్పీకర్ ఎందుకు వాయిదా వేశారో అర్థం కావడం లేదని చెప్పారు. స్పీకర్ ను అవమానించేలా జగదీశ్ రెడ్డి మాట్లాడలేదన్నారు. స్పీకర్ ను కలిశామని, రికార్డులు తీయాలని అడిగామని చెప్పారు. 15 నిమిషాలు అయినా వీడియో రికార్డును స్పీకర్ తెప్పించలేదని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాట్లాడకుండా బ్లాక్ చేశారని మండిపడ్డారు.

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ సభలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారని, సభలో అందరూ సమానమే, అందరికీ సమాన హక్కులు ఉంటాయన్నారు. తాము స్పీకర్‌ని అమానించలేదన్నారు. నిన్న రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను డైవర్ట్ చెయ్యడానికి ఇవన్నీ మాట్లాడుతున్నారన్నారు.

# అసెంబ్లీలో రచ్చ

(మొదటి పేజీ తరువాయి)

అవమానిస్తూ ఆ పదవి నుంచి బర్తరఫ్ చేశారని గుర్తుచేశారు. సభలో దళిత సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల శామ్యూల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో దళితమంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కూడా బీఆర్ఎస్ అవమానించిందని అన్నారు. అనంతరం మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ జగదీశ్‌రెడ్డి దురహంకారంతో జుగుప్సాకరంగా, ఏహ్యభావంతో మాట్లాడారని అన్నారు. కొన్ని వర్గాలు, కొన్ని కుటుంబాలకే గౌరవం అంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సంపత్‌కుమార్‌ను అకారణంగా వారి పదవీకాలం ముగిసేవరకు శాసనసభ నుంచి సస్పెండ్ చేసిన అంశాన్ని ప్రస్తావించారు. బీఆర్ఎస్ సభ్యులకు ఆపార్టీ అధినేత కేసీఆర్ శాసనసభాపక్ష సమావేశంలో ఇవే నేర్పించారా అని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న సభాపతిని ఆ హోదాలో చూడలేక, ఇంకోరకంగా చూస్తున్నారని విమర్శించారు. కఠిన నిర్ణయం తీసుకోవాలనీ, జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యల్ని ఎథిక్స్ కమిటీ పరిశీలన చేసి ఆయన పదవీకాలం ముగిసేవరకు సభ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. అనంతరం శాసనసభావ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ శాసనసభ గౌరవాన్ని కాపాడటం సభ్యులుగా అందరి బాధ్యత అనీ, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు ముగిసేవరకు ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేయాలని ప్రతిపాదించారు. స్పీకర్ దీన్ని ఆమోదిస్తూ జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్టు ప్రకటించారు. అనంతరం గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వరరెడ్డికి అవకాశం ఇచ్చారు. ఆ సమయంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వెళ్లిపోయారు.

## డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి హాజరవుతాం

బలగం టీవి, హైదరాబాద్

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధ్వర్యంలో మార్చి 22న చెన్నైలో నిర్వహించబోతున్న సమావేశానికి బీఆర్ఎస్ ను ఆహ్వానించేందుకు హైదరాబాద్ వచ్చిన డిఎంకే నేతలు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణ మరియు నీటి సరఫరా మంత్రి కె.ఎన్. నెహ్రూ, రాజ్యసభ ఎంపీ ఎన్.ఆర్. ఎలాంగో బృందంతో తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారితో సమావేశమయ్యారు. అనంతరం రెండు పార్టీల నేతలు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ "డీలిమిటేషన్ మీద దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాల్సిన సందర్భం ఇది. తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సమష్టిగా పోరాడినట్లయితే తప్పకుండా దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరుగుతుంది. 1970–80 దశకంలో ఫ్యామిలీ ప్లానింగ్ బాగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల పార్లమెంట్ స్థానాలను కొత్తగా వచ్చిన సెన్సెస్ ప్రకారం నిర్ణయిస్తాం అనడం అన్యాయం. ఫలితంగా పార్లమెంట్ లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుంది. ఈ విషయంలో స్టాలిన్ ఏర్పాటు చేస్తున్న అఖిలపక్ష సమావేశానికి బీఆర్ఎస్ తరపున హాజరు కావాలని కేసీఆర్ గారు ఆదేశించారు. కేసీఆర్ ఆదేశం ప్రకారం మార్చి 22న జరిగే సమావేశానికి హాజరై బీఆర్ఎస్, తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తాం అన్నారు.

## వెంకంపేట్ జడ్పీహెచ్ఎస్ లో గిఫ్ట్ ఏ స్మైల్...

బలగం టీవీ , సిరిసిల్ల



సిరిసిల్ల నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలకు సిద్ధమవుతున్న పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం లో భాగంగా మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సహకారంతో సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మాజీ కౌన్సిలర్ కల్లూరి రాజు పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కల్లూరి రాజు మాట్లాడుతూ పదవ తరగతి కీలకమని, విద్యార్థులు బాగా చదివి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి నాయకులు సబ్బని హరీష్ , ప్రధానోపాధ్యాయులు దూస రఘుపతి ,ఉపాధ్యాయులు దేవయ్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేత

బలగం టీవీ , తంగళ్ళపల్లి



తంగళ్ళపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పరీక్ష ప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేయమని ఆదేశాలు జారీ చేయగా విద్యార్థులకు బి ఆర్ ఎస్ మండల నాయకులు అందజేశారు. ఫ్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్,వైస్ చైర్మన్ వెంకట రమణారెడ్డి,మండల అధ్యక్షుడు గజభింకర్ రాజన్న,మాజీ జడ్పీటీసీ కోడి ఆంతయ్య,మాజీ ఎంపీపీ పడిగెల మానస రాజు, మాజీ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు వలకొండ వేణుగోపాల్ రావు, కందుకూరి రామ గౌడ్,మాజీ సర్పంచ్ వేముల శ్రీమతి,మాజీ ఉపసర్పంచ్ సాయిరాం,మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు సాదుల భాస్కర్, జక్కని రమేష్, వేముల కిషన్, వెంకటేశం పాల్గొన్నారు.

## ప్రశ్నించడమే రాజద్రోహం అనే ధోరణి నడస్తున్నది

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

కాంగ్రెస్ పాలనలో ప్రశ్నించడమే రాజద్రోహమనే ధోరణి నడుస్తున్నదనీ, తెలంగాణ ప్రజలు అంతా గమనిస్తున్నారని ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి అన్నారు. ప్రశ్నించినందుకు ఇద్దరు మహిళా జర్నలిస్టులను అరెస్టు చేశారనీ.. ఇది బాధాకరమన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మా రెడ్డి, కోవా లక్ష్మి, మల్లారెడ్డి, కె.పి.వివేకనంద గౌడ్‌లతో కలిసి మాట్లాడారు. గతంలో రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్ట్ విజయారెడ్డి, సరితాపై దాడి చేశారనీ, రాష్ట్రంలో అసలు ఏం పాలన సాగుతుందో తెలియడం లేదన్నారు. రేవంత్ రెడ్డి వద్దే హోం శాఖ ఉందనీ..ఆయన కనుసైగల్లో జర్నలిస్టుల పై దాడి జరుగుతోందనీ, ముఖ్యమంత్రి ఇంకా స్పందించడం లేదన్నారు. మరోవైపు వేదికల మీద మహిళలపై గొప్పలు చెబుతున్నారనీ, తెలంగాణలో మహిళా జర్నలిస్టుల అరెస్టు కపిల్ సిబల్ ఖండించారనీ.. ఇది వారి ప్రభుత్వ తీరుకు నిదర్శనమన్నారు. ఇందిరమ్మ పాలన, సోనియమ్మ దీవెన అంటూ మహిళా జర్నలిస్టుల అరెస్టు, మీడియా ప్రతినిధుల మీద జరుగుతున్న దాడులు ఖండిస్తున్నామన్నారు. కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడారన్నారు. ఏదో రకంగా సభలో మమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. మాట్లాడే అవకాశమూ ఇవ్వడం లేదన్నారు.

# మా గొంతునొక్కారు

(మొదటి పేజీ తరువాయి)

గ్యారంటీలు, ఇచ్చిన 420 హామీల వాగ్దానాల భంగంపై విమర్శలతో దాడి చేస్తుంటే.. తట్టుకోలేని ప్రభుత్వం.. నీతిబాహ్యంగా, నిస్సిగ్గుగా ఇవాళ కేవలం అబద్ధాలపై ఆధారపడే బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్‌రెడ్డిని అనని మాటను అన్నట్లుగా చిత్రీకరించి సస్పెండ్ చేసే ప్రయత్నం చేశారు. జగదీశ్‌రెడ్డి ఒక్కమాట అన్‌పార్లమెంటరీ మాట సభలో మాట్లాడలేదు. అన్నదీ ఒక్కటే మాట.. స్పీకర్ గారు మాకు అందరికీ తండ్రిలాంటి వారు.. మీరు మా అందరి తరఫున అక్కడ ఉన్నారు.. మా అందరి మా హక్కులు మీరే కాపాడాలని ఆక్రోషం వ్యక్తం చేశారు. ఎక్కడ కనీసం ఒక్కమాట కూడా స్పీకర్‌ను అగౌరవంగా, పొరపాటున అనలేదు. కానీ, అనని మాటను అన్నట్లుగా.. జరగని తప్పును జరిగినట్లుగా చిత్రీకరించి మా గౌరవ సభ్యుడిని ఈ సమావేశాలు ముగిసేంత వరకు సస్పెండ్ చేస్తున్నామని.. ఏకపక్షంగా, నియంతృత్వ పోకడలతో రాష్ట్ర ప్రభుత్వం ఐదుగంటలు సభను వాయిదా వేసింది.. ఢిల్లీలో ఉన్న రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు గొంతునొక్కారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మాకు కనీసం అవకాశం ఇవ్వలేదు. ఉరిశిక్ష వేసేముందు కూడా ఖైదీలకు తమ వాదన చెప్పుకునేందుకు అవకాశం కల్పిస్తారు. కానీ, జగదీశ్‌రెడ్డికి తాను చేసిన తప్పేంది.. నేను మాట్లాడిన తప్పు ఏంటీ? అనే వివరణ అడిగేందుకు అవకాశం ఇవ్వలేదు. మా నాయకుడు, తెలంగాణ సాధకుడు కేసీఆర్ మాకు స్పష్టంగా అవకాశం ఇచ్చారు. స్పీకర్ పెద్దవారు. ఆయన బాధపడి ఉంటే.. ఏం పర్వాలేదు విచారం వ్యక్తం చేయండని చెప్పారు. సభ సజావుగా జరిగేటట్టు సహకరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఆ మాటను స్పీకర్, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుకు స్పష్టంగా చెప్పాం. మాకు మైక్ ఇవ్వండి.. మేం నిజంగానే మేం పొల్లు మాట మాట్లాడి ఉంటే.. టీవీ పెట్టి శాసనసభలో చూపెట్టండి.. సభ్యులుందరికీ చూపించండి.. అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. ఇలాంటి ప్రతిష్టంభన ఏర్పడ్డప్పుడు.. మూడ్ ఆఫ్ ది హౌస్ తీసుకుంటారు, అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటారు' అని తెలిపారు.

'అవసరమైతే అన్ని స్పీకర్ చాంబర్‌లో ఒక సమావేశం పెట్టి ప్రతిష్టంభన తొలగించేందుకు ప్రయత్నం చేస్తారు. ఒకవేళ ఏదైనా మాట దొర్లిందని మీరు భావిస్తే మా సభ్యులు హుందాగా ముందుకు వచ్చి విచారం వ్యక్తం చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మేం తప్పు చేయలేదు. ఒక్క పొల్లుమాట మాట్లాడలేదు. అయినా సరే.. స్పీకర్‌పై ఉండే గౌరవంతో.. ఆ పదవిపై ఉండే గౌరవంతో మేం అవసరమైతే విచారం వ్యక్తం చేసి.. సభ సజావుగా జరిగేందుకు సహకరిస్తామని స్పీకర్, మంత్రికి చెప్పాం. కానీ, చేయని తప్పుకు మొత్తం సెషన్ అంతా జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. హరీశ్‌రావు రిపీటెడ్‌గా అడుగుతున్నారు. మా పార్టీ తరఫున మా వాదన చెప్పనివ్వాలని.. చెప్పేది వినండి అన్నా వినకుండా.. కాంగ్రెస్ పార్టీ సభ్యులు నలుగైదుగురితో మాట్లాడించారు. వారు చెప్పిందే వేదమని.. చెప్పిందే సత్యం అన్నట్లు బుల్డోజ్ ధోరణితో.. నియంతృత్వ పోకడలతో ఈ రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయం తీసుకొని మా సభ్యుడి గొంతునొక్కారు' అంటూ కేటీఆర్ మండిపడ్డారు.

# డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

తలపెట్టిన డీలిమిటేషన్ ఎత్తుగడకు వ్యతిరేకంగా అవసరమైతే జాతీయ స్థాయిలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. తమిళనాడు మంత్రి కేఎన్ నెహ్రూఆధ్వర్యంలో, ఎంపీలు కనిమొళి , ఎ.రాజా ఇతర నేతలతో కూడిన డీఎంకే ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి గారిని ఢిల్లీలో కలిసి, ఈ నెల 22న తమిళనాడు సీఎం స్టాలిన్ గారు చెన్నైలో నిర్వహిస్తున్న సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానం అందజేశారు. భేటీ అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. "పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది సహా ఇతర రాష్ట్రాలకు వాటిల్లే నష్టంపై చర్చించడంతో పాటు కేంద్రం కుట్రలను నిలువరించేలా తదుపరి కార్యాచరణ తీసుకోడానికి విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినందుకు తమిళనాడు సీఎం స్టాలిన్ గారిని అభినందిస్తున్నాను. మా పార్టీ హైకమాండ్ అనుమతి తీసుకొని ఈనెల 22న చెన్నై వేదికగా జరగబోయే సమావేశానికి హాజరవుతాను. దేశ ప్రగతిలో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం ఎంతో ఉన్నప్పటికీ, కేవలం తమకు రాజకీయంగా పట్టు చిక్కడంలేదనే అక్కసుతో బీజేపీ డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలను లిమిట్ చేయాలని భావిస్తోంది. ఈ కుట్రలను కచ్చితంగా తిప్పికొట్టి, దేశ సమైక్యతను, ఫెడరల్ స్ఫూర్తిని కాపాడుకుంటాం. అందుకోసం అవసరమైతే జాతీయ స్థాయిలో ఆందోళన చెపడతాం.

తెలంగాణ రాష్ట్రంలోనూ డీలిమిటేషన్ అంశంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గారు, మాజీ మంత్రి జానారెడ్డి గారి సారధ్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నాం. బీజేపీ సహా అన్ని రాజకీయ పార్టీలతో పాటు పౌర సమాజం ప్రతినిధుల అభిప్రాయాలను తీసుకొని కేంద్రానికి నివేదిస్తాం. ప్రతిఒక్కరు రాజకీయాలకు అతీతంగా స్పందించాల్సిన సందర్భం ఇది." అని ముఖ్యమంత్రి గారు అన్నారు.

# 100% ఆస్తి పన్ను వసూలు చేయాలి..

**-గ్రామాలలో ఆస్తుల రీ అసెస్మెంట్ కు ప్రణాళికాబద్ధంగా చర్యలు..**

**-పంచాయతీ విధులను పకడ్బందీగా నిర్వహించాలి..**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**



గ్రామాలలో ప్రభుత్వ విధులను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పంచాయతీ శాఖ పని తీరు పై పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ రివ్యూ నిర్వహించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ, పన్నుల వసూలు, ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల ఫీజుల వసూళ్ల పై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలు, ఇండ్ల ఆస్తి పన్ను 100% వసూలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మరో 17 రోజులు సమయం మాత్రమే ఉందని,ఆస్తి పన్ను వసూలు లక్ష్యాలను చేరుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా తక్కువ ఆస్తి పన్ను వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ ప్రత్యేకంగా రివ్యూ చేశారు. ఆస్తి పన్ను చెల్లించిన వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలని అన్నారు.గ్రామాలలో అవసరమైన చోట ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆస్తి పన్ను విలువ పెంచాలని, రీ – అసెస్మెంట్ చేసి సరైన ఆస్తుల విలువ ప్రకారం పన్ను వసూలు చేయాలని సూచించారు. గ్రామాలలో వ్యాపారాల ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ సకాలంలో జరిగేలా చూడాలని, ట్రేడ్ లైసెన్స్ లేకుండా ఎక్కడైనా వ్యాపారాలు నిర్వహిస్తే సీజ్ చేయాలని అన్నారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ పన్ను ముందుగా వసూలు చేయాల్సి ఉంటుందని అన్నారు. గ్రామాలలో మల్టీ పర్పస్ సిబ్బంది వేతనాలు ఎప్పటికప్పుడు పంచాయతీ నిధుల నుంచి చెల్లించాలని అన్నారు.

గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్వాడీ కేంద్రాల పరిసరాలలో అపరిశుభ్రత అధికంగా గమనిస్తున్నామని, దీన్ని నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, గ్రామాలలో ఉన్న ప్రభుత్వ భవనాల పరిసరాల్లో పరిశుభ్రత పట్ల శ్రద్ధ పెట్టాలని అన్నారు.రోడ్లను రెగ్యులర్ గా శుభ్రం చేయాలని, ప్రతి రోజు ప్రజల నుంచి చెత్త సేకరణ జరగాలని అన్నారు. గ్రామాలలో పెండింగ్ ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు క్లియర్ చేయాలని అన్నారు. ఆమోదించిన ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల నుంచి ఫీజు వసూలు చేయాలని, దరఖాస్తుదారులను ఫాలో అప్ చేస్తూ మార్చి 31 లోపు ఫీజు చెల్లించేలా చూడాలని, ప్రజలు ప్రభుత్వం కల్పించిన 25% రిబేట్ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు.ఎల్ఆర్ఎస్ చేసుకోకపోతే ఇంటి నిర్మాణం అనుమతులు, ఇతరులకు అమ్మేందుకు ఆస్కారం ఉండదని, ఎల్ఆర్ఎస్. చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో డిపిఓ. శరిపుద్దీన్, డిఎల్పిఓ నరేష్, డిటిసిపిఓ అన్సర్, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హెూలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి...

**-స్నానాల కోసం అధిక నీటి ప్రవాహం,లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దు**

**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**



హెూలీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో , సురక్షితంగా జరుపుకోవాలని,రోడ్లపై ట్రాఫిక్కు అంతరాయం,పరిచయం లేని వ్యక్తులపై బలవంతంగా రంగులు చల్లిన, గొడవలు సృష్టించిన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ మహేష్ బి. గితే గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హెూలీ వేడుకల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం, జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.యువకులు అత్యుత్సాహం ప్రదర్శింస్తూ ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేసిన , మైనర్లు డ్రైవింగ్ చేసిన,వారిని పట్టుకుని వాహన యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. హెూలీ వేడుకలు ముగిసిన తరువాత స్నానాల కోసం అధిక నీటి ప్రవాహం,లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దు అని సూచించారు.పండుగ వేళ ఇతరులపై బలవంతంగా రంగులు వేసిన,గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా,ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలను వేదింపులకు గురిచేసిన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని,తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు.

# కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ...

**బలగం టీవీ , సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మహేష్ బి గితే సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేసారు.

**ఎస్పీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మహేష్ బి గితే ను సిరిసిల్ల లోని ఎస్పీకార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగన్న,సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్.సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్.మురళీ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్, సత్తార్ లు పాల్గొన్నారు




# అన్నదాతకు అందని నీరు.. నీటి కోసం తాపత్రయం

**-కాలువకు గండి కొట్టినందుకు రైతులపై కేసు**

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**



మండలంలోని రైతుల పోలాలు ఎండిపోకుండా నీళ్లు అందించాలని తాపత్రయంతో జక్కాపూర్ శివారు నుండి దాచారం రామచంద్రపూర్ బాణప్ప చెరువు మీదుగా ఎల్లమ్మ చెరువుకు నీళ్ల కోసం జక్కపూర్ కెనాల్ దగ్గర కాలువకు గండి కొట్టినందుకు రైతులపై సిద్దిపేట ఇరిగేషన్ ఏఈ ఫిర్యాదుతో చిన్నకోడూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు.రైతుల పొలలు ఎండిపోకుండా వుండడానికి ఎన్ని కేసులు పెట్టిన భయపడే ప్రసక్తే లేదని రైతులు తెలిపారు. మండలానికి చెందిన బైరినేని రాము మాజీ ఎంపీటీసీ,శ్రీరాముల వెంకటేష్,బత్తుల మహేష్,మేకల బాలయ్య,గడ్డం సందీప్ రెడ్డి,గజ్జల దేవరాజు,తడకల రమేష్,కట్కూరి ప్రభాకర్,తడకల స్వామి,గడ్డం రమేష్, దరిపెల్లి యాదగిరి , గజ్జల భూపతి,బర్ల రాజు,గంగాపురం రవీందర్, మాట్ల దుర్గయ్య లపై కేసులు చేయడం విడ్డురంగా ఉందని తెలిపారు.

# మచ్చ అనిల్ కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ



**-కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్**

**-మృతుని కుటుంబానికి రూ. 51,500 అందజేత**

**బలగం టీవీ , బోయినిపల్లి**

మచ్చ అనిల్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాకకు చెందిన మచ్చ అనిల్ గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 50వేల రూపాయల నగదుతో పాటు సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్ అందజేసిన 50 కిలోల రైస్ బ్యాగులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ అందజేసిన 50 కిలోల రైస్ బ్యాగులను అనిల్ కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా అనిల్ కుటుంబ సభ్యులకు కూస.రవీందర్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనిల్ కు సంగీతతో 9 ఏళ్ళ క్రితం వివాహం కాగా, ఏడు సంవత్సరాల కొడుకు, 5 ఏళ్ల కూతురు ఉండగా బీద కుటుంబం కావడంతో నిలువ నీడ, ఉండడానికి సరైన ఇల్లు కూడా లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చింది.అనంతరం కూస రవీందర్ మాట్లాడుతూ: కొదురుపాక చెందిన నిరుపేద వ్యక్తి అయిన మచ్చ అనిల్ అనారోగ్యంతో మృతి చెందడంతో మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో వాట్సాప్ గ్రూపులో అనిల్ మృతి విషయం తెలపడంతో కాంగ్రెస్ నాయకులు స్పందించి ఇచ్చిన 51వెయ్యి 500 రూపాయలను అనిల్ కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. అలాగే మృతుని భార్య డిగ్రీ పూర్తి చేయడంతో మంత్రి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, ఔట్సోర్సింగ్ లో జాబ్ ఇచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మరోసారి భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జోగినిపల్లి వెంకటరామరావు, బోలుమాల శంకర్, మాజీ జెడ్పిటిసి పులి లక్ష్మీపతి గౌడ్, నాగుల వంశీ గౌడ్, కత్తెరపాక రవీందర్, జంగం అంజయ్య, మాజీ ఎంపిటిసి ఉయ్యాల శ్రీనివాస్, పిట్టల రమేష్, పెంజర్ల బాలమల్లు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అనుముల హరికృష్ణ, మెరుపుల మహేష్, వెంకటేష్, పెంతల మహేందర్, తదితరులు ఉన్నారు

# బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలుగా లావణ్య..



**బలగం టీవీ , సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి మహిళ మోర్చా ఉపాధ్యక్షురాలుగా లావణ్య రామలింగారెడ్డి ని నియమిస్తూ బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పలం అన్నపూర్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ బిజెపి పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేస్తానని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్తానని అన్నారు. నా నియమకానికి కృషిచేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు గోపి,బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పలం అన్నపూర్ణ లకి కృతజ్ఞతలు తెలిపారు.



## ఉప్పల్ స్టేడియానికి కొత్త హంగులు

**బలగం టీవి, హైదరాబాద్**

రూ.ఐదు కోట్ల వ్యయంతో ఉప్పల్ స్టేడియానికి కొత్త హంగులు సమకూర్చుతున్నట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు తెలిపారు. ఐపీఎల్ 2025 సీజన్ కోసం ఉప్పల్ స్టేడియాన్ని ముస్తాబు చేస్తున్నామని చెప్పారు. బుధవారం బీసీసీఐ, సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రతినిధులతో కలిసి జగన్ మోహన్ రావు గ్రౌండ్ రినోవేషన్ పనులను పరిశీలించారు. మరో పది రోజుల్లో ఉప్పల్ వేదికగా తొలి ఐపీఎల్ మ్యాచ్ జరగనుండడంతో పనుల్లో వేగం పెంచాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. స్టేడియం మొత్తం పెయింటింగ్ వేస్తున్నామని, నార్త్ స్టాండ్స్‌లో కొత్త రెస్ట్ రూమ్స్ నిర్మిస్తున్నామని, క్రికెటర్ల డ్రెస్సింగ్ రూమ్స్, కార్పొరేట్ బాక్సుల్లో ఏసీలు, టైల్స్ మారుస్తున్నామని చెప్పారు. స్టేడియానికి కొత్త రూపు తెచ్చేందుకు హెచ్‌సీఏ నుంచి సుమారు రూ. 5 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. సీఎస్ఆర్ పథకం కింద సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం కూడా సహకారం అందిస్తుందని జగన్ మోహన్ రావు తెలిపారు. జగన్ మోహన్ రావుతో పాటు బీసీసీఐ నుంచి వైభవ్, యువరాజ్, సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం నుంచి శరవానణ్, రోహిత్ స్టేడియంలో జరుగుతున్న పనులను

# ఫైనల్‌కు ముంబయి ఇండియన్స్

**బలగం టీవి, హైదరాబాద్**

డబ్ల్యూపీఎల్‌లో ముంబయి ఇండియన్స్? ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్‌ను 47 పరుగుల తేడాతో ఓడించిన ముంబై ఇండియన్స్ ఈ లీగ్‌లో రెండోసారి ఫైనల్ చేరింది. ఆరంభ ఎడిషన్‌లో టైటిల్ సాధించిన ముంబై.. రెండో టైటిల్ కైవసం చేసుకోవడమే లక్ష్యంగా మరోసారి తుది పోరుకు దూసుకెళ్లింది

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో 213-4 భారీ స్కోర్ చేసింది. హేలీ మ్యాథ్యూ (77 పరుగులు, 50 బంతుల్లో), నాట్ సీవర్ (77 పరుగులు, 41 బంతుల్లో) మెరుపు హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. ఆఖర్లో కెప్టెన్ హర్మన్ ప్రీత్ (36 పరుగులు, 12 బంతుల్లో) దుమ్మురేపారు. గుజరాత్ బౌలర్లలో జిబ్సన్ 2, కాశ్వీ గౌతమ్ 1 వికెట్ దక్కించుకున్నారు.

ముంబయి నిర్దేశించిన 214 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ 19.2 ఓవర్లలో



166 రన్స్‌కు ఆలౌటైంది. ముంబయి బౌలర్లలో మ్యాథ్యూ 3, అమెలియా కేర్ 2, షబ్నమ్, నాట్ సీవర్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. ఇక ఇప్పటికే ఫైనల్‌కు చేరిన ఢిల్లీ క్యాపిటల్స్‌తో ముంబయి టైటిల్ పోరులో తలపడనుంది. ఆదివారం జరగనున్న ఈ ఫైనల్ మ్యాచ్‌కు ముంబయి స్టేడియం వేదిక కానుంది.



## ఐపీఎల్ నుంచి హ్యారీ బ్రూక్ రెండేండ్లు సస్పెండ్

**బలగం టీవి, హైదరాబాద్**

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ప్లేయర్ హ్యారీ బ్రూక్‌కు ఐపీఎల్ కౌన్సిల్ షాక్ ఇచ్చింది. సరైన కారణం లేకుండా ఐపీఎల్ నుంచి వైదొలిగినందుకు, కొత్త నిబంధనల ప్రకారం లీగ్ నుంచి అతడిని సస్పెండ్ చేసింది. అతడిపై వచ్చే రెండేళ్లపాటు ఈ సస్పెన్షన్ ఉండనుంది. దీంతో రానున్న రెండు ఐపీఎల్ ఎడిషన్ల (2025, 2026)లో బ్రూక్ ఆడడానికి అనర్హుడు. ఈ నిర్ణయం ప్రపంచ క్రికెట్‌లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ సీజన్‌లో హ్యారీ బ్రూక్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. మెగా వేలం పాటలో ఢిల్లీ క్యాపిటల్స్ రూ.6.25 కోట్లను వెచ్చించి బ్రూక్‌ను సొంతం చేసుకుంది. కానీ బ్రూక్ మాత్రం తాను ఈసారి ఐపిఎల్‌లో ఆడడంలేదని ప్రకటించాడు. ఈ నిర్ణయం ఢిల్లీ షాక్ ఇచ్చింది. దీంతో వెంటనే స్పందించిన ఢిల్లీ యాజమాన్యం విషయాన్ని బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లింది. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన బీసీసీఐ సంచలన నిర్ణయం తీసుకుంది. రానున్న రెండేళ్ల పాటు ఐపిఎల్‌లో ఆడకుండా బ్రూక్‌పై నిషేధం విధించింది. మెగావేలం పాటకు ముందే బిసిసిఐ ఐపిఎల్ కోసం బీసీసీఐ కఠిన నిబంధనలను అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే బ్రూక్‌పై వేటు వేసింది.



## సంక్రాంతికి వస్తున్నాంకు 18.1 టీఆర్పీ రేటింగ్

**బలగం టీవి, హైదరాబాద్**

విక్టరీ హీరో వెంకటేష్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం వెండితెరపై సెన్సేషనల్ హిట్ అయ్యి 300 కోట్లకి పైగా గ్రాస్ ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇక థియేటర్ తర్వాత ఈ సినిమా ఓటీటీ, బుల్లితెరకి వచ్చేసింది. అయితే సినిమా బుల్లి తెరపైనా రికార్డ్ సొంతం చేసుకుంది. ఈ మధ్య కాలంలో ఓటీటీ స్ట్రీమింగ్ అయిన చాలా రోజుల తర్వాత బుల్లి తెరపై సందడి చేస్తున్నాయి. కానీ సంక్రాంతికి వస్తున్నాం సినిమాను ఓటీటీ స్ట్రీమింగ్ కంటే ముందే జీ తెలుగు వరల్డ్ ప్రీమియర్ టెలికాస్ట్ చేయడంతో ఈ సినిమా 18.1 రేటింగ్ సాధించి రికార్డ్ కొట్టింది. కరోనా సమయంలో ఓటీటీలు ఎక్కువ కావడంతో టీఆర్పీ 10 రీచ్ కావడమే చాలా కష్టంగా ఉండేది. గత ఐదేళ్ల కాలంలో పవన్ కళ్యాణ్ వకీల్ సాబ్ సాధించిన 19.12 టీఆర్పీ నెం.1 గా ఉండగా, ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాం సినిమా 18.1 టీఆర్పీ నమోదు చేసి రెండవ స్థానంలో నిలిచింది. మన తెలుగులో ఆల్ టైం హైయెస్ట్ రేటింగ్ కనుక చూస్తే అల వైకుంఠపురములో 29 కి పైగా రేటింగ్ అందుకుంది. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలుగా నటించిన విషయం తెలిసిందే. చిత్రానికి అనీల్ రావిపూడి దర్శకత్వం వహించారు.

## 'ఎస్ఎస్ఎంబీ 29' షూటింగ్‌పై ఒడిశా డిప్యూటీ సీఎం పోస్ట్

**బలగం టీవి, హైదరాబాద్**



టాలీవుడ్ దర్శకధీరుడు ఎస్-ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో ఒక మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 'ఎస్-ఎస్ఎంబీ 29' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ ప్రాజెక్ట్‌ను దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ ప్రియాంక చోప్రా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తుండడం విశేషం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఒడిశాలో శరవేగంగా జరుగుతోంది. అయితే, ఈ మూవీ షూటింగ్‌పై తాజాగా ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరిదా ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా షూటింగ్ ఒడిశాలో జరగడం రాష్ట్రానికి గర్వకారణమని, ఇది స్థానిక పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు రాష్ట్రాన్ని సినిమా షూటింగ్‌లకు ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తుందని ఆమె ట్వీట్ చేశారు.

"గతంలో మల్కాన్‌గిరిలో 'పుష్ప-2' షఉటింగ్ జరిగినట్లే.. ఇప్పుడు ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో రాబోయే చిత్రం 'ఎస్ఎస్ఎంబీ 29' కోసం కోరాపుట్‌లో షూటింగ్ జరుగుతోంది. ఈ సినిమాలో టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్, అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన నటి ప్రియాంక చోప్రా నటిస్తున్నారు. ఇది ఒడిశా పర్యాటక రంగానికి మంచి అవకాశం లాంటిది. ఈ చిత్ర షూటింగ్ వల్ల భవిష్యత్‌లో ఒడిశా సినిమా షూటింగ్‌లతో పాటు పర్యాటకరంగానికి ఒక గొప్ప గమ్యస్థానంగా మారుతుంది. మా దగ్గర షూటింగ్స్ చేసేందుకు అన్ని భాషల ఇండస్ట్రీలను స్వాగతిస్తున్నాం. షూటింగ్‌లకు పూర్తి మద్దతు, ప్రపంచ స్థాయి సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇస్తున్నాం" అంటూ ఒడిశా డిప్యూటీ సీఎం తన 'ఎక్స్' పోస్టులో రాసుకొచ్చారు. ఆమె పోస్ట్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

## ఐపీఎల్‌లో ఆడనున్న మిచెల్ మార్ష్..!

- **కేవలం బ్యాటర్‌గా...**

**బలగం టీవి, హైదరాబాద్**



ఐపీఎల్ కు ముందు లక్నో సూపర్ జయింట్స్ కు గుడ్ న్యూస్. ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్ ఐపీఎల్ ఆడతానని కన్ఫర్మ్ చేశాడు. ఈ విషయాన్ని అతను గురువారం (మార్చి 13) ప్రకటించాడు. అయితే అతను కేవలం బ్యాటర్ గానే కొనసాగుతానని చెప్పడం విశేషం. దాంతో 33 ఏళ్ల ఈ ఆసీస్ ఆల్ రౌండర్ లక్నో తరపున ఇంపాక్ట్ ప్లేయర్ గా బరిలోకి దిగే అవకాశం ఉంది. ఐపీఎల్ 2025 మెగా ఆక్షన్ లో మార్ష్ ను రూ. 3.4 కోట్లకు లక్నో జట్టు సొంతం చేసుకుంది.

మిచెల్ మార్ష్ నిపుణులతో చర్చించిన తర్వాత లక్నో జట్టు తరపున ఆడేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లుగా ఓ నివేదిక పేర్కొంది. రీహాబిలిటేషన్, వైద్య పరీక్షల అనంతరం ఈ ఆల్‌రౌండర్‌కు షరతులతో కూడిన అనుమతి వచ్చింది. అతను బౌలింగ్ చేయొద్దని.. ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో వీపుపై ఎక్కువగా ఒత్తిడిపడకుండా చూసుకోవాలని స్పెషలిస్ట్ అడ్వైజ్ ఇచ్చాడు. నివేదిక ప్రకారం మార్ష్ మార్చి 18న లక్నో జట్టుతో కలవనున్నాడు. మార్చి 24 న ఢిల్లీ క్యాపిటల్స్ తో లక్నో సూపర్ జయింట్స్ తమ తొలి మ్యాచ్ ఆడనుంది.




## 'పెళ్లి కాని ప్రసాద్' ట్రైలర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

టాలీవుడ్ నటుడు సప్తగిరి లీడ్ రోల్?లో తెరకెక్కిన లేటెస్ట్ సినిమా 'పెళ్లి కాని ప్రసాద్'. అభిలాష్ రెడ్డి ఈ సినిమా తెరకెక్కించారు. ప్రియాంక శర్మ హీరోయిన్‌గా నటించారు. మార్చి 21న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ గురువారం ట్రైలర్ రిలీజ్ చేశారు. ఉద్యోగంలో ఎక్స్‌పీరియన్స్‌తోపాటు పెళ్లి విషయంలో ఎక్స్‌పయిరీ డేట్ దగ్గరపడుతోందంటూ ట్రైలర్‌లో సప్తగిరి నవ్వులు పూయించారు. ఈ ట్రైలర్ ఆద్యంతం నవ్వులు పంచేలా ఉంది.

## ఓటీటీలోకి 'బ్రహ్మా ఆనందం'

**బలగం టీవి, హైదరాబాద్**

బ్రహ్మానందం ఇటీవల తన కుమారుడు రాజా గౌతమ్‌తో కలిసి నటించిన సినిమా 'బ్రహ్మా ఆనందం'. ఈ చిత్రం థియేటర్లలో విడుదలై మంచి మార్కులు సొంతం చేసుకుంది. అయితే ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ రిలీజ్ కి రెడీ అయ్యింది. మార్చి 14 నుండి ఆహాలో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది. రాహుల్ యాదవ్ నక్కా నిర్మించిన ఈ సినిమాకు ఆర్వీఎస్ నిఖిల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి శాండిల్య పిసపతి సంగీతం అందించారు.

